విశాలాంధ్ర
గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

విద్యుత్ భారాలు తగ్గించాలి

వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

విశాలాంధ్ర - అమలాపురం : విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, సీపీఎం, వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జి. దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగింది. వామపక్ష పార్టీల నాయకులు, సీపీఐ జిల్లా కార్యదర్శి కే సత్తిబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ సీనియర్ నాయకులు మచ్చా నాగయ్య మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు భారీగా వస్తున్నాయని, ప్రతినెల చార్జీలు పెరిగిపోతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కుని విద్యుత్ దోపిడీ సాగిస్తున్నాయని అన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని, 200 యూనిట్లు వరకు అందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని వైసిపి మాట ఇచ్చి నమ్మకద్రోహం చేసిందన్నారు. వివిధ రూపాలలో విద్యుత్ భారాలు మోపుతోందని అన్నారు. చార్జీల పెంపు, ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, విద్యుత్ సుంకం, ఫిక్స్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, సర్ చార్జీలు, అదనపు డిపాజిట్లు ఇలా రకరకాల పేర్లతో ప్రజలను కొల్లగొడుతోందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల కయ్యే వేలాది రూపాయలు వినియోగదారులే భరించాలని, కేంద్రం విద్యుత్ చట్టానికి సవరణలు ప్రతిపాదనలు పార్లమెంటు ముందున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యుత్ రంగం పూర్తిగా కార్పొరేట్ల కబంధహస్తాల్లోకి వెళుతోందన్నారు. తక్షణం విద్యుత్ భారాలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలని, ప్రమాదకరమైన విద్యుత్ సంస్కరణలు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం జిల్లా నాయకులు పీతల రామచంద్రరావు, దైవవాణి విప్పర్తి మోహనరావు, పాము బాలయ్య, తాడి శ్రీరామ్ మూర్తి, ఊటాల వెంకటేష్, కంచే సత్యనారాయణ, బీమాల శ్రీను, సకిలే సూర్యనారాయణ, జగడం నాగేశ్వరరావు, టి నాగవరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి : కలెక్టర్ హిమాన్షుశుక్లా

విశాలాంధ్ర - కాట్రేనికోన : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమంలో అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కాట్రేనికోన మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు, హిమాన్షు శుక్లా, రెవిన్యూ డివిజనల్ అధికారి వసంతరాయుడితో కలిసి మండల పరిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి, పరిష్కరించవలసిందిగా ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితర సమస్యలకు సంబంధించి సుమారుగా 51 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. నుపూర్ అజయ్, సిపిఓ వెంకటేశ్వర్లు, డ్వామా పిడి ఎస్.మధుసూదన్, డిఆర్డిఏ పిడి, వి. శివశంకర్ ప్రసాద్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి జీవీ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడకు ఇండియా స్మార్ట్ సిటీ అవార్డు

విశాలాంధ్ర - కాకినాడ : మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ బ్రిలియంట్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన ఇండియా స్మార్ట్ సిటీస్ అవార్డు కంటెస్ట్ (ఐఎస్ఏసీ)-2022 విజేతలకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ చేతులమీదుగా కాకినాడ జిల్లా కలెక్టర్, కాకినాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డాక్టర్ కృతికా శుక్లా, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, మునిసిపల్ వైద్య అధికారి డా పృథ్వీచరణ్‌తో కలిసి అవార్డు అందుకున్నారు. స్మార్ట్ సిటీల పోటీల్లో పారిశుద్ధ్యం కేటగిరీలో ఘన వ్యర్థాల నిర్వహణ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) విభాగంలో దేశంలోనే రెండోస్థానంలో కాకినాడ స్మార్ట్ సిటీ నిలవడంతో ఈ అవార్డు లభించింది.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌కు వినతి

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక రైల్వే స్టేషన్లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్ట్ ఇప్పించాలని బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావుకు గోదావరి రెడ్డి కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధుల బృందం వినతి పత్రం అందజేశారు. బుధవారం విశాఖపట్నంలో గోదావరి రెడ్డి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు పీవివి సూరెడ్డి ఆధ్వర్యంలో పీవీవిని కలిసి మధ్యాహ్నం సింహాద్రి ఎక్స్ప్రెస్ తర్వాత రాత్రి వరకు విశాఖపట్నం వెళ్లేందుకు అనపర్తిలో ఆగే రైలు ఏమీ లేదని దీంతో రైలు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కనుక సాయంత్రం 4 గంటలకు అనపర్తి వచ్చే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్ట్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన ఎంపీ జీవీవీ తక్షణమే రైల్వే ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడటం జరిగిందని అధికారులు సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార, ఇతరేతర వ్యవహారాల రీత్యా విశాఖపట్నంలో స్థిరపడినప్పటికీ మాతృభూమి అనపర్తిలో జన్మభూమి హాల్ట్‌కి గోదావరి రెడ్డి కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రయత్నించడం పట్ల అనపర్తి రైల్వే సంఘం ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో రెడ్డి కల్చర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పులగం సూర్యనారాయణ రెడ్డి, కార్యదర్శి సత్తి వీర్రాఘవరెడ్డి (శివమణి), జాయింట్ సెక్రెటరీ కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (కోర్టు శ్రీను), ఓగిరెడ్డి వెంకటరెడ్డి, తేతలి వీరేంద్ర రెడ్డి, తాడి శివారెడ్డి, తాడి చినబాబు తదితరులు ఉన్నారు.

ఉప్పాడ తీరంలో డాల్ఫిన్ చేప

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : ఉప్పాడ తీరంలో డాల్ఫిన్ చేప ఒడ్డుకు కొట్టుకొచ్చినట్లు స్థానిక మత్స్య కారులు తెలిపారు. ఇది సుమారు 40 కేజీల బరువు మూడు మీటర్ల పొడవు ఉంటుందని పలువురు తెలిపారు. బుధవారం ఉప్పాడ, కాకినాడ బీచ్ మార్గం మధ్యలో ఉన్న కొత్త వంతెన సమీప తీరం వద్ద డాల్ఫిన్ చేప కొట్టుకు వచ్చింది. డాల్ఫిన్ మనుషులతో ఎంతో ఫ్రెండ్లీగా ఉంటాయని ఇవి సంతానోత్పత్తి జరిగిన తర్వాత వాటి పిల్లలను సుమారుగా మూడు సంవత్సరాలు తల్లితోనే ఉండి తర్వాత వేరు పడతాయని మత్స్యకార పెద్దలు తెలుపుతున్నారు. ఉప్పాడ తీరానికి మృతి చెందిన డాల్ఫిన్ కొట్టుకు రావడంతో చూసేందుకు అనేకమంది బారులు తీరారు. సముద్రంలోనే డాల్ఫిన్ మృతి చెంది ఉంటుందని అలల దిశ ద్వారా ఉప్పాడ సమీప తీరానికి కొట్టుకొచ్చినట్లు మత్స్యకారులు తెలుపుతున్నారు.



మనసు పరిమళాలు పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తపేట : ప్రముఖ కవి, సివిల్ ఇంజినీర్, కొత్తపేటకు చెందిన జినిపే భీమారావు(చిన్నీ)రచించిన మనసు పరిమళాలు సిసింద్రీ కవితా సంపుటిని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిభావంతమైన కవి కలం మనసు లోతుల్లోకి వెళ్లి మనస్సు పరిమళాన్ని అక్షరాలతో ఆవిష్కరణ చేశారని అన్నారు. అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక జాతీయ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంచే పద్మభూషణ్ బోయి భీమన్న జీవిత సాఫల్య పురస్కారం పొందిన డాక్టర్ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యంలో నానీలు, హైకూలు, గాలిపటాలు, వంటి ఎన్నో ప్రక్రియలు వచనకవిత్వాన్ని సుసంపన్నం చేస్తున్నాయని, కవి భీమారావు సిసింద్రీ ప్రక్రియ ద్వారా 211 కవితలు రచించి పుస్తక రూపంలో తీసుకువచ్చినందుకుకవిని అభినందించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు వెంకటరాజు, నాని రాజు, రాజు, సాహితీ వేత్తలు నల్లా నరసింహమూర్తి, బివివి సత్యనారాయణ, మాకే బాలార్జున, సత్యనారాయణ పాల్గొని కవిని అభినందించారు.

బీవీసీ గ్రూపు మొత్తం అటానమస్

విశాలాంధ్ర - అమలాపురం : బివిసి గ్రూప్ పరిధిలో వున్న అన్ని కళాశాలలు ఇప్పుడు అటానమస్‌గా యూజీసీ వారిచే గుర్తించబడ్డాయి. గతంలోనే అటనమస్‌గా బీవీసీ ఓడలరేవు, బీవీసీ భట్లపాలెం కళాశాలలు గుర్తించబడ్డాయి. ఇప్పుడు బీవీసీ రాజమండ్రి క్యాంపస్ కూడా యూజీసీ చేత అటానమీ హోదా పొందింది. ఈ సందర్భంగా కళాశాలల అధినేత బోనం కనకయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోనే గ్రూపు కళాశాలల్లో అన్ని అటనమస్ హోదా పొందిన కళాశాలలుగా గుర్తింపు పొందడం గర్వకారణంగా ఉందని హర్షం వ్యక్తం చేసారు. చైర్మన్ బోనం సతీష్ మాట్లాడుతూ త్వరలోనే యూనివర్సిటీ హోదా పొందేలా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ సందర్భంగా కళాశాలల విద్యార్థులు, సిబ్బందికి సతీష్ కృతజ్ఞతలు తెలిపారు.

సామూహిక ఎలుకల నివారణతో అధిక దిగుబడులు

విశాలాంధ్ర - కరప : రైతులు సామూహిక ఎలుకల నివారణ చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడిఏ బాబురావు తెలిపారు. కరప మండలం గొర్రిపూడి గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద కరప గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు ఎలుకల మందు పంపిణీ చేసినట్టు ఏడిఏ బాబురావు తెలిపారు. ఎలుకల మందును 4.80 గ్రాములు నూకలు, 10 గ్రాముల మందు 10 గ్రాముల నూనె బాగా కలిపి ఎరను తయారు చేసుకోవాలని రైతులకు సూచించారు. ముందుగా మందు కలపని నూకలను చిన్నచిన్న పొట్లాలుగా కట్టి పొలాల గట్లపై ఎలుకలు సంచరించే ప్రదేశాలలో ఉంచాలని మరుసటి రోజున పొట్లాలు తెరిచి ఉన్నట్లయితే ఆ ప్రదేశంలో మందు కలిపిన ఎరను ఉంచాలని పొట్లాలు కట్టి ఉంచాలని రైతులకు వ్యవసాయ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అగ్రికల్చర్ అధికారి రాజేష్, డిఆర్సి ఏడిఏ మాధవి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

'త్రాగునీరు వృథా' కథనానికి స్పందించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - సీతానగరం: త్రాగు నీరు వృథా- పట్టించుకోని అధికారులు అనే శీర్షికన విశాలాంధ్రలో ప్రచురితమైన కథనానికి రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విశాలాంధ్ర విలేకరితో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేపట్టని విధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మారుమూల మూడు గ్రామాలకు 44 లక్షల రూపాయ లతో సత్యసాయి పథకంలో భాగంగా గండికోట గ్రామం నుండి పైపులైన్లు వేయించినట్టు తెలిపారు. విశాలాంధ్ర పత్రికలో వచ్చిన చీపురుపల్లి గ్రామం రామాలయం వద్ద పైపులైను పగిలి నీరు వృథాగా పోతున్న విషయంపై ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. దీనికి ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీర్ అవినాష్ పైపులైను పగిలిన ప్రాంతంలో మరమ్మత్తుల పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని గురువారం లోగా మరమ్మత్తు పనులు పూర్తిచేసి యథాతథంగా త్రాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆదిత్యకు అటానమస్ హోదా

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో గల "ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్' కళాశాల, "ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసి" , ఆదిత్య ఫార్మసి కళాశాలలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) న్యూ ఢిల్లీ వారి నుండి అటానమస్ స్టేటస్ లభించినట్లు ఉత్తర్వులు అందాయని ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్. సతీష్ రెడ్డి తెలియజేసారు. కళాశాలలో గల సౌకర్యములను, విద్యాబోధనలో గల ఉన్నత ప్రమాణాలను ప్రాతిపదికగా తీసుకొని యూజీసీ వారు ఈ స్టేటస్‌ను ప్రకటించారని తెలిపారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలకు ఈ విద్యా సంవత్సరం 2023-24 నుండి 2028-29 వరకు 5 సంవత్సరాలకు, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసి కళాశాలకు 2023-24 నుండి 2032-33 వరకు 10 సంవత్సరాలు, ఆదిత్య ఫార్మసీ కళాశాలకు 10 సంవత్సరాలు ఈ అటానమస్ స్టేటస్ పొందినట్లు యుజిసి నుంచి ఉత్తర్వులు రావడం ఆదిత్య గ్రూప్‌నకు గర్వకారణమని, భవిష్యత్తులో మరింతగా అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణతో ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దగలమని తెలిపారు. ఈ సందర్భంగా ఈ అటానమస్ స్టేటస్ సాధించు టకు కృషిచేసిన సిబ్బందికి ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డాక్టర్ సతీష్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎమ్ శ్రీనివాసరెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ కె రవిశంకర్, డాక్టర్ డి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తెదేపా రిలే దీక్షలు

విశాలాంధ్ర-కొవ్వూరు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా కొవ్వూరు నియోజకవర్గంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగు తున్నాయి. బుధవారం కొవ్వూరు మండలం దొమ్మేరు రాష్ట్ర రహదారి పక్కన దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ద్విసభ్య కమిటీ నాయకులు జొన్నలగడ్డ చౌదరి, కంటమణి రామకృష్ణల ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా మాజీ ఎమ్మెల్యే కొవ్వూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ టీవీ రామారావు అక్కడ ఉన్న చెట్టుకు ఉరేసుకోవడానికి ప్రయత్నిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి జనసేన నాయకులు రామారావును వారించారు. ఈ సమయంలో అక్కడ కొంత టెన్షన్ వాతావరణం ఏర్పడింది. కాగా శిబిరంలో మాజీ జడ్పిటిసి గారపాటిశ్రీదేవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, కలగర రంగారావు, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి పొట్రు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి అందరి సహకారం అవసరం

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు పట్టణాభివృద్ధికి కౌన్సిలర్లు, అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని మున్సిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా సమావేశానికి అధ్యక్షత వహించిన రత్నకుమారి మాట్లాడుతూ స్థానిక హెూం మంత్రి తానేటి వనిత సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. ఈ సంద ర్భంగా పలు వార్డుల్లో ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. మున్సిపల్ కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు విషయం కూడా అజెండాలో చర్చకు పెట్టగా ఆమోదం లభించింది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నందున మున్సిపల్ అధికారులు ముఖ్యంగా సానిటేషన్ విభాగం వాళ్ళు అప్రమత్తంగా ఉండాలని, వార్డుల్లో శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని చైర్పర్సన్ సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు సూరపని చిన్ని తదితర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ సమావేశం

విశాలాంధ్ర - పెద్దాపురం : పట్టణంలో మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురి అవుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు నిలదీశారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో బుధవారం మున్సిపల్ చైర్పర్సన్ బొద్దు తులసీమంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్,ఆరెళ్లి వీర్రాఘవులు, ఆకుల కృష్ణబాబూజీ మాట్లాడుతూ పట్టణంలో అనేక చోట్ల మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోక పోవడం పట్ల మండిపడ్డారు. లెప్రసీ కాలనీలో మున్సిపల్ స్థలంలో అక్రమ కట్టడాలు నిర్మించినా చూసి చూడనట్టు వదిలేయడం సరికాద న్నారు. 9,10 వార్డుల్లో వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా మునిసిపల్ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా స్థలాలను గుర్తించి వాటికి రక్షణ కల్పించాలని వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ చైర్పర్సన్ తులసి మంగతాయారులను ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై వాడివేడి చర్చసాగింది. ఈ సమావేశంలో వైస్ చైర్ పర్సన్ కనకాల మహాలక్ష్మి, కమిషనర్ సురేంద్ర,మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డిఇఇ అదినారాయణ శానిటరీ ఇన్ స్పెక్టర్ దావీదురాజు, ఆర్ఓ. చంద్రశేఖరం తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వేతో భూ వివాద రహితంగా గ్రామాలు

విశాలాంధ్ర - కాకినాడ : అత్యంత పారదర్శకంగా, జవాబుదారీ తనంతో ప్రజలకు భూ యాజమాన్య హక్కుల కల్పనకు, గ్రామాలను భూ వివాద రహితంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకంగా జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష కార్యక్రమాన్ని అమలుచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానందహాల్‌లో వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్.. మిషన్ సభ్యులు జె.రామారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ లంక ప్రసాద్, సర్వే ఏడీ బి.లక్ష్మీనారాయణ తదితరులతో కలిసి సమగ్ర భూసర్వేపై సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల రైతులు, వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన శాఖల అధికారులు, సర్వే, సెటిల్‌మెంట్స్, భూ రికార్డుల శాఖ అధికారులు, సమగ్ర భూసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు తదితరులు హాజరైన ఈ సమావేశంలో జిల్లాలో సమగ్ర భూసర్వే పురోగతితో పాటు క్షేత్రస్థాయిలో రైతుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపైనా చర్చించారు. సమావేశంలో పశు సంవర్ధక శాఖ జేడీ డా. సూర్యప్రకాష్‌రావు, వివిధ ప్రాంతాల రైతులు, అధికారులు తదితరులు హాజరయ్యారు.

ఎస్టీయూ నిరసన

విశాలాంధ్ర - కాకినాడ : అసెంబ్లీలో జీపియస్ బిల్లు ఆమోదానికి నిరసనగా కాకినాడ జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద సాయంత్రం 5.30 గంటలకు ఎస్‌టీయు కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాశీ విశ్వనాథ్, మోర్త శ్రీనివాస్, డివిఎస్ రాజు, యు శ్రీను, పి రామకృష్ణ, మహేష్, వెంకట్, లోవరాజు, రామకృష్ణ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు రాజేష్

విశాలాంధ్ర - గోకవరం : కామరాజుపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థి జట్ల రాజేష్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం అనపర్తి బాలుర పాఠశాలలో జరిగిన అండర్ 17 వాలీబాల్ పోటీలలో రాజేష్ మొదటి స్థానం సంపాదించి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా రాజేష్‌ను కామరాజుపేట గ్రామ ప్రజలు అభినందించారు. మరిన్ని పోటీల్లో విజయం సాధించా లని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఆనంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఈశ్వరి దేవి,కామరాజు పేట గ్రామ సర్పంచ్ అడపా వెంకట్రావు, కొత్తపల్లి గ్రామ సర్పంచ్ కాటమస్వామి, పాఠశాల చైర్మన్ కోటీన లావ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపై హర్షం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : గత ఇరవై మూడేళ్లుగా కాంట్రాక్టు అనే బానిస జీవితానికి విముక్తి కల్పిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 10,117మంది కాంట్రాక్టు ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించ డానికి అంగీకారం తెలుపుతూ బుధవారం అసెంబ్లీలో బిల్లు ఆమోదించిన సీఎం జగన్‌కు కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గొర్ల మాణిక్యం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. తమ జీవితాంతం జగన్‌కి ఋణపడి ఉంటామన్నారు. గతంలో అనేక ప్రభుత్వాలు తమ క్రమబద్ధీకరణ అంశం ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి హామీ ఇచ్చి మోసం చేశాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లేటి చంద్రశేఖర్, కొప్పిశెట్టి దొరబాబు, గొర్ల పాపారావు, ముప్పన త్రినేత్ర కుమారి, కంటు శివయ్య, నేమాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంలో విషాదం : విద్యార్థి గల్లంతు

విశాలాంధ్ర - ఆలమూరు : వినాయక విగ్రహ నిమజ్జనానికి వెళ్లి విద్యార్థి గల్లంతైన ఘటన బుధవారం ఆలమూరు మండలంలోని మడికి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలియజేసిన వివరాలు ప్రకారం అదే గ్రామానికి చెందిన అత్తిలి రాకేష్ (22) సూరంపాలెంలో ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మడికి సంత మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనంలో భాగంగా ఊరేగింపు పూర్తి చేశారు. జాతీయ రహదారి చెంతన ఉన్న ప్రధాన కాలువ వద్ద స్థానికులతో రాకేష్ కలిసి నిమజ్జనంలో పాల్గొన్నాడు. అనంతరం స్నేహితులతో ఈతకొట్టే తరుణంలో రాకేష్ గల్లంతైనట్లు వారు తెలిపారు. స్థానిక పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకోగా మార్కెట్ కమిటీ చైర్మన్ యనమదుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేపట్టారు.

ఉత్తమ సేంద్రీయ వనరుల కేంద్రంగా ముక్కామల

విశాలాంధ్ర-పెరవలి : రాజమహేంద్రవరం సి టి ఆర్ ఐ లో (సిటిఆర్ఐ)సెంట్రల్ టొబాకో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారి ఆధ్వర్యంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ శాఖతో నిర్వహించిన కార్యక్రమంలో పెరవలి మండలం ముక్కామల గ్రామానికి చెందిన కాశీ విశ్వనాథం రైతుకు ఉత్తమ సేంద్రియ వనరుల కేంద్రానికి ఉత్తమ బహుమానంగా మెమెంటోని ఇచ్చి సత్కారాన్ని చేశారు.ఈకార్యక్రమంలో సి టి ఆర్ ఐ డైరెక్టర్ శేషు మాధవ్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బి. తాతారావు సమక్షంలో కాశీని సత్కరించారు.ఈ సందర్భంగా వారు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి రైతుకు చేరే విధంగా వనరులను సరఫరా చేయాలని వీటి ద్వారా రైతులకు సేంద్రియ వ్యవసాయాన్ని మరియు సేంద్రియ పద్ధతులపై మరింత అవగాహన పెంచుకోవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథం మాట్లాడారు.

నియంత పాలనకు చరమగీతం పాడాలి

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అధిక ధరలతో సామాన్యుడి నడ్డి విరుస్తున్నదని వామపక్ష పార్టీలు ధ్వజమెత్తాయి. స్థానిక శ్యామల సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరే కంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కుంద్రపు రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజా వ్యతిరేక విధానాలతో ఒక నియంత పాలన సాగిస్తున్నదని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ భారాలను సామాన్యుడికి అందని ద్రాక్ష చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ నగర కార్యదర్శి వి. కొండలరావు మాట్లాడుతూ ఒక నియంత పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి దుర్మార్గపు పాలన నశించాలని అన్నారు. సామాన్యునిపై విపరీతమైన భారాలను ఉపసంహరించుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సప్ప రమణ, సిడగం నవరోజీ, నగర కార్యవర్గ సభ్యులు ఎడ్ల లక్ష్మి, వానపల్లి సూర్యనారాయణ, ఏ.ఐ.ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతలపూడి సునీల్, పేపర్ మిల్ యూనియన్ నాయకులు కే రామకృష్ణ, జివి రామారావు ,జట్లు సంఘం సభ్యులు పెంట దేవుడి బాబు , తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయు జిల్లా అధ్యక్షుడిగా నేరేడుమిల్లి

విశాలాంధ్ర - అయినవిల్లి : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయు) డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం (మెయిన్) ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేరేడుమిల్లి సత్యనారా యణ (ఎన్ఎస్ఎన్) ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ వృత్తిలో 34 ఏళ్ల అనుభవం కలిగిన సత్యనారాయణ జిల్లా అధ్యక్షుడుగా ఎన్నిక కావడం పట్ల అయినవిల్లి మండలం ఎస్టీయూ శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాంబాబు, పసుపులేటి శ్రీనివాస్, దడాల రాజశేఖర్, కెవివి సత్యనారాయణ, గిడ్డి భీముడు, కే సిద్ధార్థ, జై భీమారావులతోపాటు పలువురు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - అనపర్తి : "గొయ్యితో పొంచి ఉన్న ప్రమాదం" శీర్షికన విశాలాంధ్రలో బుధవారం వెలువడిన వార్తతో అధికారులు స్పందించారు. బుధవారం రోడ్డుమీదుగా ప్రయా ణించే ప్రయాణికులు గోతిలో పడకుండా అడ్డుగా పెట్టిన తారు పీపా, రోలు తొలగించి అధికారులు రోడ్డు మరమ్మత్తులు చేపట్టారు. విశాలాంధ్రలో ప్రచురితమైన వార్తకు వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన అధికారులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

అందరి ఆరోగ్యం జగనన్న లక్ష్యం

విశాలాంధ్ర - నిడదవోలు : రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ భూపతి భూపతి ఆదినారాయణ తెలిపారు. ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు ఆదేశాల మేరకు 23వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా వార్డులోని ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులకు బీపీ,షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది నారాయణ మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకంలో భాగంగా గృహాలను సందర్శించే ఆరోగ్య సిబ్బందికి సహకరించి పరీక్షలను నిర్వహించు కోవాల్సిందిగా కోరారు. అక్టోబర్ 4న నెహ్రూనగర్ అర్బన్ ఆస్పత్రిలో నిర్వహించే వైద్య శిబిరానికి రావాల్సిందిగా ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ సెక్రెటరీ మద్దిపాటి ఫణింద్ర, కౌన్సిలర్లు మద్దిపాటి నాగశ్రీ,గోపిరెడ్డి శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్త ,ఆశా వర్కర్లు, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అప్రజాస్వామ్యం

విశాలాంధ్ర - గోపాలపురం : రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా అప్రజాస్వామిక పరిపాలన జగన్మోహన్ రెడ్డి కొనసాగిస్తున్నారని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు, తెదేపా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి శిష్టా లోహిత్, జనసేన గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డికర్ల సువర్ణరాజు దుయ్యబట్టారు. బుధవారం మండలంలోని వేళ్ళ చింతలగూడెం గ్రామంలో తెలుగుదేశం, జనసేన పార్టీ శ్రేణులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా తెదేపా ప్రధాన కార్యదర్శి మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా వైకాపా ప్రభుత్వం చేస్తున్న అప్రజాస్వామిక పరిపాలనను ప్రజానీకానికి తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్న మీ భవిష్యత్తుకు మా గ్యారెంటీ, యువగళం పేరుతో నారా లోకేష్, ప్రజానీకాన్ని చైతన్యపరుస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి పార్టీని చిత్తుగా ఓడిస్తామని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పిన్నమనేని నాగేంద్ర, కొర్లపాటి రాము, కొర్లపాటి అన్నవరం, ఇల్లూరి రాంబాబు, పరిమి జగదీష్, మాజీ జెడ్పిటిసి ఈలి మోహిని పద్మజారాణి, మాంద్రు రాణి, గద్దె హరిబాబు, దొరబాబు, జేష్ట శ్రీనివాసరావు, మద్దిపాటి రమేష్, అధిక సంఖ్యలో మహిళలు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

సఫాయి కార్మికులకు సన్మానం

విశాలాంధ్ర - కరప : సఫాయి మిత్ర సురక్ష శివిర్ కార్యక్రమంలో భాగంగా కరప గ్రామం చెత్త నుండి సంపద కేంద్రం ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న సఫాయి మిత్రలుగా పనిచేస్తున్న కార్మికులకు గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి లోహిదాస్ ఆధ్వ ర్యంలో ఘనంగా సన్మానించినట్టు ఈఓ ఆర్‌డిఎస్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి డివిజనల్ పంచాయతీ అధికారి అన్నామణి ముఖ్య అతిథిగా పాల్గొని పారిశుద్ధ్య కార్మికులకు కావలసిన చేతి తొడుగులు, మాస్కులు, డెటాల్, సబ్బులు, వంటి కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర కుమార్, జూనియర్ అసిస్టెంట్ కేశవరావు, బిల్ కలెక్టర్ త్రిమూర్తులు, ఏఎన్ఎం ఉష, ఆశ వర్కర్లు రత్నకుమారి, తంతా సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బాలిక హత్య కేసు నిందితుడు

విశాలాంధ్ర - పెద్దాపురం : మైనర్ బాలికను ఎత్తుకెళ్ళి హత్య చేసి పరారైన నిందితుడు బత్తిన నాని ఎట్టకేలకు పెద్దాపురం పోలీసులకు చిక్కాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కలవచర్ల సమీపంలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 20వ తేదీన పదేళ్ల చిన్నారి ద్రోణ ప్రవీణకుమారి అలియాస్ మానస అదృశ్యమైనట్లు తల్లి జ్యోతి పెద్దాపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి చిన్నారి ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులకు బాలిక మృతదేహం కనబడడంతో విచారణ మరింత లోతుగా దర్యాప్తు చేశారు. దీంతో బాలిక సమీప బంధువు బత్తిన నాని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని గుర్తించిన పోలీసులు నిందితుడు కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేసారు. ఎట్టకేలకు బుధవారం కలవచర్ల సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడు నానిని విచారణ కోసం పెద్దాపురం డిఎస్పీ కార్యాలయానికి తరలించారు.

అరాచక పాలన అంతమొందిస్తాం

విశాలాంధ్ర-ఏలూరు: ఎన్ని తప్పుడు కేసులు నమోదు చేసినా భయపడే ప్రసక్తి లేదని రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతమొందిస్తామని టిడిపి ఎస్సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ హెచ్చరించారు. తేదేపా, ఎస్ సి సెల్ రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసిస్తూ తక్షణం విడుదల చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం బాలాజీ మీడియాతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరిస్తున్నదని అన్నారు. తప్పులు చూపితే అక్రమ కేసులు పెడుతున్నారన్నారు.జగన్ పాలనతో జనం విసిగిపోయారన్నారు. లోటు బడ్జెట్ నుండి సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేసిన చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో విజయం తథ్యం అని ముఖ్యమంత్రి జగన్ భయపడిచంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, రేవులి గడ్డ లాలా లజపతిరాయ్, మాజీ ఎంపీపీ మాణిక్యాలరావు, టిడిపి నాయకులు ఎల్ రవీంద్రబాబు, పూనూరు రాజేష్, శ్రీకాంత్, జాలా శివశంకర్, చిట్ల నాని, సీనియర్ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : ప్రపంచ రేబిస్ డే సందర్భంగా స్థానిక పశు వైద్యశాల వద్ద గురువారం కుక్కలకు ఉచితంగా యాంటీ ర్యాబీస్ టీకాలు వేయడం జరుగుతుందని పశు వైద్యాధికారి బి ఆర్ శ్రీనివాసన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుక్కల పెంపకం దారులు, కుక్కలకు టీకాలు వేయించాలని, వాటి ఆరోగ్య పరిరక్షణకు సహాయ సహకారాలు అందించాలని ప్రతి ఒక్కరూ వైద్యశాల వద్దకు తమ కుక్కలను తీసుకువచ్చి రాబిస్ టీకాలు వేయించుకోవాలని పేర్కొన్నారు.

మహా అన్నసమారాధన ప్రారంభించిన ఎస్‌పి

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: స్థానిక అమీనా పేట పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద గల అభయాంజనేయ స్వామి గుడి ప్రక్కన గల శ్రీసిద్ధి వినాయక ఆలయంలో వినాయక నవరాత్రులను ఘనంగా నిర్వహించారు. బుధవారం సిద్ధి వినాయక దేవాలయం ప్రాంగణం లోనూ మహా అన్నసమారాధన కార్యక్రమాన్ని జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి నిర్వహించారు. ఎస్‌పి స్వయంగా ప్రజలకు ఆహారం వడ్డించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని ఆకలి అన్ని వర్ణాలు, మతాల వారికి ఒకటేనని గ్రహించిన మన పూర్వీకులు పండుగ పర్వదినాలను పురస్కరించుకుని అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించే వారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్ పి ఎస్. శేఖర్, ఏలూరు డిఎస్ పి ఈ శ్రీనివాసులు,ఎస్ బి సిఐ ఎం సుబ్బారావు, 1వ పట్టణ సీఐ ఏలూరు రాజశేఖర్, ఏ.ఆర్,ఆర్.ఐ పవన్ కుమార్, ఆర్.ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం పంచాయతీ పరిధిలో గొల్లలదిబ్బ ఆవు బొమ్మ గుడి వద్ద ఏర్పాటుచేసిన వినాయకుడు విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు కూసంపూడి సురేంద్ర కుమార్ రాజు బుధవారం తెలిపారు. రెండోవ వర్షికోత్సవం పురస్కరించుకుని వినాయక చవితిని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాట్ల సత్తిబాబు, డి.వి రమణ రాజు,చంపాటి నరసింహ రాజు,నంద్యాల రవి కిరణ్ రాజు, నంద్యాల సతీష్ రాజు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. శనివారం గుడి వద్ద భారీ అన్న సమారాధన జరుగుతున్నట్లు తెలిపారు.

చంద్రబాబు అరెస్టుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉంచిన నేపథ్యంలో బుధవారం జంగారెడ్డిగూడెంలో ఏలూరు జిల్లా కలెక్టర్ నిర్వహించిన జగనన్నను చెబుదాం కార్యక్రమంలో తేదేపా ఆధ్వర్యంలో రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు టిడిపి నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శేషు కలెక్టర్‌తో మాట్లాడుతూ ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ కుట్రలో చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసారన్నారు. అరెస్ట్ చేసి 19 రోజులు గడిచినా నేటివరకు ఎలాంటి ఆధారాలు చూపలేదని, లేని, వేయని ఇన్నర్ రింగురోడ్డులో అవినీతి జరిగిందని కేసు పెట్టడం అత్యంత ఘోరమైన చర్య అన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర -ఏలూరు: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డి.ఎల్.టి.సి,ఐటిఐ సహాయ సంచాలకులు ఎస్. ఉగాది రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన క్రింద డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఆ పైన ఉత్తీర్ణులైన వారు 15 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని ఆయన తెలిపారు. ఈ నెల 30 చివరి తేదీ వివరాలకు 9493482414,9494963143 నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

విశాలాంధ్ర - నిడమర్రు: కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని రైతు సంఘం నిడమర్రు మండలం శాఖ ప్రభుత్వాన్ని కోరింది. బుధవారం ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నిడమర్రు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లావేటి సోంబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ వ్యవసాయం చేసే కౌలు రైతులు నష్టపోయిన వారందరికీ నష్ట పరిహారం అందించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి కోన శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల కట్టబెట్టాలని ఉద్దేశంతో 660 జీవో ఇచ్చింది. ఆ జీవో రద్దుచేసి నష్టపోయిన రైతులు కౌలు రైతులు ప్రభుత్వ ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం నిడమర్రు తహసిల్దార్ బి సాయి రాజ్ కి సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ ధర్నాలో వెలగలేటి మోహన, కానూరు రాజు,నేతి దొరబాబు, దుత్తాడ వెంకన్న, మిండిబాపి రాజు, మురపాకి నరసింహమూర్తి, దండుపాటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు పనుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: నాడు నేడు పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శ్యాంసుందర్ హెచ్చరించారు. బుధవారం జంగారెడ్డిగూడెం పట్టణంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మండలంలో నాడు నేడు ఫేజ్-2 పనులు నిర్వహిస్తున్న 55 పాఠశాలల పురోగతిని మండల విద్యా శాఖ అధికారులు బి. రాముడు,జి.రాములు ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలకు రివాల్వింగ్ ఫండ్ రూ. 63.48 లక్షలు జమ అయితే కేవలం రూ. 45.90 లక్షలు మాత్రమే ఖర్చు చేయడం పై పాఠశాల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం అదే పాఠశాలలో జరుగుతున్న ఫిజికల్ సైన్స్ కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు విద్యార్థుల పట్ల ఉండవలసిన మెలకువలను ఆయన తెలియజేసారు. ఈ కాంప్లెక్స్ సమావేశం నందు బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల నుండి ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

సామూహిక ఎలుకల నిర్మూలన

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నారాయణపురం, ఉంగుటూరు రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఉంగుటూరు ఏవో బాలిన వెంకటేష్ ఆధ్వర్యంలో బ్రోమోడయోలిన్‌ను నూకల మిశ్రమంలో కలిపి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉంగుటూరు మండల ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షులు బందారు నాగరాజు, ఎంపిటిసి అరవెల్లి మహాలక్ష్మి దానయ్య, రైతు భరోసా కేంద్రం చైర్మన్ మత్తుకుమల్లి, ఉంగుటూరు రైతు భరోసా కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో ఏవో బాలిన వెంకటేష్, సర్పంచ్ బందారు సింధు, మధుబాబు, రైతు భరోసా కేంద్రం చైర్మన్లు తల్లాటి శివరామ కృష్ణ, మంద పాపారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వర స్వామికి పట్టు వస్త్రాల సమర్పణ

విశాలాంధ్ర-ఏలూరు: శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాల సందర్భంగా బుధవారం నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈనెల 26 నుండి 29వ తేదీ వరకు జరుగు స్థానిక ఆర్‌ఆర్ పేట శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం 22 వ వార్షిక పవిత్రోత్సవములు రెండవ రోజు కార్యక్రమాలకు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాసరావు, ఈవో నాగం సన్యాసిరావు ఆధ్వర్యంలో తొలుత ఆలయ మర్యాదలతో మేయర్ దంపతులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, బత్తిన విజయకుమార్ ధర్మకర్తల మండలి సభ్యులు అర్చకులు మారుతి తదితరులు ఉన్నారు.

పోలసానిపల్లి గురుకులంలో జిల్లా స్థాయి బాలిక క్రీడా పోటీల ఎంపికలు

విశాలాంధ్ర-భీమడోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -19 (బాలికల) జిల్లాస్థాయి పోటీలు పొలసానిపల్లి గురుకుల పాఠశాలలో బుధవారం నిర్వహించినట్లు స్పోర్ట్స్ స్కూల్ జిల్లా సమన్వయకర్త కె. జయరాజు, ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి తెలిపారు. క్రీడాపోటీలలో భాగంగా తపక్ తక్రా, టెన్నికాయిట్ ,త్రోబాల్ గేమ్స్ తో పాటు ఐదు రకాల అథ్లెటిక్స్ లోని వివిధ పోటీలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కు వివిధ పాఠశాలలు, కళాశాలకు చెందిన 400 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారు త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధులుగా పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

టిఎన్ఆర్ టవర్స్‌లో ఘనంగా ముగిసిన గణపతి నవరాత్రోత్సవాలు

విశాలాంధ్ర- కైకలూరు : ఆదిపూజ్యుడు.. విఘ్ననాయకుడు.. లంబోదరుడు.. గణనాధుని నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కోరుకొల్లు రోడ్డులోని టిఎన్ఆర్ టవర్స్‌లో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిసాయి. వినాయక చవితి (గత సోమవారం) నుంచి బుధవారం వరకు టిఎన్ఆర్ టవర్స్‌లో ఉన్న కుటుంబీకులంతా నవరాత్రి ఉత్సవాలను శోభాయమానంగా నిర్వహించారు. రోజుకో దంపతులు చొప్పున 9 రోజులపాటు ప్రతి రోజు పీటలపై కూర్చుని ఉభయదంపతుల పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని బుధవారం ఉదయం 200 మందికి అన్నసమారాధన నిర్వహించారు. టిఎన్ఆర్ టవర్స్ అధినేత తానా ప్రసాద్-శ్రీలక్ష్మి దంపతులు అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో అద్దంకి వెంకట శ్రీనివాసరావు, అల్లూరి బాపిరాజు, అట్లూరి కోటేశ్వరరావు, కొణిజేటి విష్ణుమోహనరావు, ఇంటి గోవిందరాజు తదితరులతోపాటు టిఎన్ఆర్ టవర్స్ కుటుంబీకులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ జయంతి

విశాలాంధ్ర-భీమడోలు: స్వాతంత్ర సంగ్రామంలో భగత్ సింగ్ పాత్ర కీలకమని ఇలాంటి పోరాట యోధుల కృషి ఫలితమే నేడు స్వాతంత్రం అని భీమడోలు మానస పాఠశాల ప్రిన్సిపాల్ ఎలమర్తి రవీంద్ర కుమార్ తెలిపారు. భీమడోలు మానస పాఠశాలలో భగత్ సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ ఫోటోతో చిన్నాలు చేసిన మార్చ్ ఫస్ట్ ఆకర్షించింది. కార్యక్రమంలో భాగంగా భీమడోలు ఎస్ ఐ చావా సురేష్ కుమార్తె కృష్ణసుకృతి చెప్పిన భగత్ సింగ్ జీవితగాథ ఆలోచింపజేసింది. ప్రతి ఒక్కరూ స్వాతంత్ర సమరయోధుల జీవిత విశేషాల పట్ల అవగాహన అవగాహన కలిగి ఉండాలని రవీంద్ర కుమార్ పేర్కొన్నారు.

చంద్రబాబు అరెస్టు దారుణం

విశాలాంధ్ర -భీమవరం: చంద్రబాబు అక్రమ కేసులను నిరసిస్తూ భీమవరంలో తెలుగు యువత నాయకులు రిలే నిరాహారదీక్షలు చేపట్టి అర్థనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు పరిణామాల అనంతరం 19 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజానీకం, టిడిపి, జనసేన, సిపిఎం, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్ రాజకీయ పార్టీలు సంఘీభావం ప్రకటిస్తున్నా జగన్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిం చడం దారుణమన్నారు. రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రబాబుపై అక్రమ కేసుల్లో న్యాయస్థానాల ద్వారా న్యాయం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తొలుత నిరాహారదీక్షా శిబిరం వద్ద చంద్రబాబు అక్రమ అరెస్టుతో మృతి చెందిన స్థానిక టీడీపీ నాయకుడు షేక్ వల్లి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయపల్లి వెంకట్, గంట త్రిమూర్తులు, కోళ్ల నాగబాబు, కముజు హరిబాబు, కొయ్యలగడ్డ గణపతి, వీరమల్లు వెంకట్, గండి భూషణం, ప్రధాన కార్యదర్శి దూసనపూడి నరేష్, గూడూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జనంలోకి జనసేన

విశాలాంధ్ర-తణుకు: జనంలోకి జనసేన -జనం కోసం జనసేన కార్యక్రమం తణుకు నియోజకవర్గం ఇన్‌చార్జి గుడివాడ రామచంద్ర రావు ఆధ్వర్యంలో జరిగింది. నియోజకవర్గంలోని అరవల్లి గ్రామంలో విడివాడ రామచంద్రరావు ప్రతి ఇంటికి వెళ్లి జనసేన పార్టీ సిద్ధాంతాలను, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలను ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను కరపత్ర రూపంలో తెలియజేస్తూ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదని తమకు న్యాయం జరిగేలా చూడాలని అరవల్లి గ్రామస్తులు కోరారన్నారు. ఈ కార్యక్రమంలో దాసం ప్రసాద్, నియోజకవర్గస్థాయి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర - నిడదవోలు : తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేయడం తృప్తినిచ్చిందని కుమారుడు వరసాల శాంతారామ్ అన్నారు . తల్లిదండ్రులు వరసాల సీతయ్య, మేరీ రత్నం జ్ఞాపకార్థం కుమారుడు శాంతారామ్ ఆర్థిక సహకారంతో నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు గురువారం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఏ వి ఆర్ ఎస్ తాతరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గుర్రం జేమ్స్, పడాల రాజేష్ ,తీట్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

యర్రంపాలెంలో ఎలుకల నిర్మూలన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం యర్రంపాలెం గ్రామంలో జిల్లా స్థాయి సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమం జేడిఏ ఎన్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం ఎలుకలు మందు పంపిణీ చేస్తున్నామని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఎలుకలు వలన వరి చేలో 35% శాతం, నిల్వ సమయంలో 15% శాతం నష్టం వాటిల్లుతుందని దీని నివారణ కొరకు రుచి, వాసన మరియు రంగు లేని బ్రోమోడయోలీన్ మందును నూకలు, నూనె తగు పాళ్లలో కలిపి గుర్తించిన ఎలుకలు బొరియలు వద్ద ఉంచడం ద్వారా వీటి ద్వారా ఏర్పడే నష్టం నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు ఓబ్బిన వీరబాబు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ వారు పంపిణీ చేస్తున్న ఈ మందును సామూహికంగా చేయడం ద్వారా ఎలుకలు వలన కలిగే నష్టాన్ని చాలా వరకు నివారించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిడిఏ హరి, (జిల్లా వనరులు కేంద్రం), ఏడిఏ వైవి గంగాధర్ కుమార్, ఏవో శ్రీరాం (జగ్గంపేట), ఏవో సద్గురు మూర్తి, ఎమ్‌పిటిసి మద్దిపాటి రామక్రిష్ణ, గ్రామ వైఎస్సార్సీపీ నాయకులు రవి, శ్రీహరి, సత్తిబాబు, బుజ్జి, విఏఏ సుమిత్ర, అలిషా, సత్యనారాయణ విహెచ్ఏ సాయికిరణ్, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి హోమం

విశాలాంధ్ర-దేవరపల్లి : దేవరపల్లి మండలం యాదవోలులో లక్ష్మీ గణపతి ఆలయంలో బుధవారం లక్ష్మీ గణపతి హోమం వైభవంగా జరిగింది ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక పురోహితులు అయిలూరి సాయి పవన్ కుమార్ ఆధ్వర్యంలో లక్ష్మి గణపతి హోమం జరిగింది. పొంగుటూరు గ్రామానికి చెందిన పసుపులేటి నరేష్ దుర్గ భవాని దంపతులు హోమం నిర్వహించారు.

గణపతిలడ్డు వేలం

విశాలాంధ్ర - కొత్తపేట : గణపతి నవరాత్రిలు ముగియడంతో గణపతి పందిరిలో తొమ్మిది రోజులు స్వామి వద్ద ఉంచిన లడ్డూలను వేలంపాటనిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్‌లో గల చింతామణి గణపతి పందిరిలో 18 కేజీల లడ్డు పాట నిర్వహించగా వాసవి యూత్ 26, 100 దక్కించుకున్నారు. అలాగే పొట్టి శ్రీరాములు వీధిలో గల వరసిద్ధి వినాయక కమిటీ నిర్వహించిన లడ్డు వేలం పాటలో 18 కేజీల లడ్డు గ్రంధి నానాజీ చాముండేశ్వరి దంపతులు రూ.17,600కి దక్కించుకున్నారు. అలాగే మరో ఏడు లడ్డులు పాటల నిర్వహించగా రూ.45400లు వచ్చినట్లు కమిటీ వారు తెలిపారు.

విఘ్నేశ్వరుని దర్శించుకున్న ఎస్వీబీసీ అడ్వైజర్

విశాలాంధ్ర - అయినవిల్లి : తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ అడ్వయిజర్ అడపా దుర్గ బుధవారం అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరవలేదన్నారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి పాలక మండలి, అధికారులు చేస్తున్న కృషిని అభినందించారు. దాతలు మరింతగా సహకరించి ఆలయ అభివృద్ధికి చేయూతనందించాలని ఆమె కోరారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గుత్తుల నాగబాబు, కార్యనిర్వహణాధికారి యం. సత్యనారాయణ రాజు, పాలకమండలి సభ్యులు కర్రి మంగాదేవి సుబ్రహ్మణ్యం, పులగుర్త మంగాదేవి మూర్తి, దుర్గను సత్కరించి విఘ్నేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించారు.

తాడిపర్రులో టీడీపీ నిరాహార దీక్ష

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా తెలుగు దేశం పార్టీ శ్రేణులు చేపట్టిన నిరాహార దీక్ష బుధవారం 16 వ రోజు తాడిపర్రు లో నిర్వహించారు. నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ దీక్షా శిబిరంలో నియోజకవర్గ, మండల, గ్రామ టిడిపి శ్రేణులు, జనసేన పార్టీ మండల నాయకులు సంఘీభావం తెలిపారు. తాడిపర్రు గీతా పారాయణ బృందం చే శిబిరం వద్ద గీతా పారాయణం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్, తెలుగుదేశం పార్టీ ఉండ్రాజవరం మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, సర్పంచుల ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి కరుటూరి నరేంద్రబాబు మద్దతు తెలిపారు.

పాలంగి సొసైటీ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: పాలంగి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వంద శాతం రుణాలు వసూలు చేసినట్లు సంఘ చైర్మన్ నాగిరెడ్డి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన అధ్యక్షతన సొసైటీ భవనంలో నిర్వహించిన మహాజన సభలో మాట్లాడారు. 2022- 2023 సంవత్సరానికి ఆడిట్ రిపోర్ట్ నికర లాభం 96, 907 గా ఉన్నట్లు తెలిపారు. సంఘ సభ్యుల రుణాలు సుమారు 10 కోట్లు ఉన్నాయని, వంద శాతం రుణాలు వసూలు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెర్సన్ వాండ్ర లక్ష్మి, వెలిచేటి జానకి రామయ్య, వెలిచేటి బోసు, బొల్లాడ రంగారావు, సకినాల నారాయణమ్మ, బసవ రమణమ్మ, సీఈవో పి విష్ణుమూర్తి, సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ట్రెండ్స్ ఫ్యాషన్ డెస్టినేషన్ కైకలూరులో ప్రారంభం

విశాలాంధ్ర-కైకలూరు: రిలయన్స్ రిటైల్ యొక్క వేగంగా అభివృద్ధి చెందుతున్న దుస్తులు మరియు యాక్సెసరీస్ ప్రత్యేక షాప్ ట్రెండ్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా కైకలూరు పట్టణంలో తన కొత్త స్టోర్ ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ట్రెండ్స్ భారతదేశంలో ఫ్యాషన్ ను ప్రజాస్వామీకరించడం ద్వారా, మెట్రోలు, మినీ మెట్రోల నుండి టైర్ 1, 2 పట్టణాల లో విస్తరిస్తుంది. కైకలూరులోని ట్రెండ్స్ స్టోర్‌లో ట్రెండీ ఉమెన్స్ వేర్, మెన్స్ వేర్, కిడ్స్ వేర్, ఫ్యాషన్ యాక్సరీస్ అందుబాటు ధరలలో ఉన్నాయి. కైకలూరు పట్టణంలో మొట్టమొదటి ట్రెండ్ స్టోర్ 7270 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. రూ.3999 షాపింగ్ చేసి రూ.249 వద్ద బహుమతిని, పొంద రూ.3999 కొనుగోలుపై రూ.2000 విలువైన కూపన్ ను పూర్తిగా ఉచితంగా పొందుతారని సంస్థ ప్రతినిధి వెల్లడించారు.

ఏలూరులో ఎస్ఎంఎఫ్ జీ గృహశక్తి

విశాలాంధ్ర- కాకినాడ: భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అందుబాటు ధరల (సరసమైన) గృహ ఋణ (హౌసింగ్ ఫైనాన్స్) కంపెనీలలో ఒకటైన ఎస్ఎంఎఫ్ జీ గృహశక్తి, ఏలూరులో తమ మొదటి శాఖతో ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించింది. ఇది రాష్ట్రంలో సంస్థకు 9వ శాఖ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా ఈ విస్తరణ, రాష్ట్ర మంతటా వీలైనంత ఎక్కువ మందికి సరసమైన ధరల్లో గృహాలను అందుబాటులోకి తీసుకురావాలనే సంస్థ యొక్క దృఢమైన లక్ష్యం ను ప్రదర్శిస్తుందని ఎస్ఎంఎఫ్ జీ గృహశక్తి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దీపక్ పాట్కర్ చెప్పారు. గతంలో ఫుల్లర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీగా గుర్తింపు పొందిన ఎస్ఎంఎఫ్ జీ గృహశక్తి , తమ విస్తృతమైన అనుభవం, బలమైన పేరెంటేజ్, దేశవ్యాప్తంగా డిస్ట్రిబ్యూషన్ మరియు బలమైన రిస్క్ మేనేజ్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్ తో గృహ , గృహాభివృద్ధి , గృహ నిర్మాణం , గృహ విస్తరణ తో పాటుగా తనఖా రుణాలు మరియు మధ్య స్థాయి డెవలపర్‌లకు కొత్త లేదా పునఃవిక్రయం వాణిజ్య ఆస్తి, వాణిజ్య ప్లాట్లు మరియు నిర్మాణ ఫైనాన్స్ కోసం రుణాలు సహా విస్తృతమైన రుణాల పోర్ట్‌ఫోలియోను కలిగి వుందని తెలిపారు.

658వ రోజు "జనం కోసం - జనసేన"

విశాలాంధ్ర - గోకవరం : జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పాఠం శెట్టి సూర్యచంద్ర ఆధ్వర్యంలో జనం కోసం జనసేన కార్యక్రమం బుధవారం నాడు గోకవరం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాటంశెట్టి సూర్యచంద్ర, శ్రీదేవి దంపతులు గ్రామంలో ఉన్న ప్రతి గడపగడపకు తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ జనసేన పార్టీ సిద్ధాంతాలతో కూడిన కరపత్రాన్ని ప్రజలకు అందజేసి రాబోయే రోజుల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాటంశెట్టి వెంట జనసేన పార్టీ తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి దోసపాటి సుబ్బారావు, గోకవరం మండల రైతు విభాగం అధ్యక్షులు ప్రగడ ప్రభ, మండల ప్రధాన కార్యదర్శి అల్లాడ త్రిలోక్ కుమార్, గోకవరం గ్రామ అధ్యక్షుడు పదిలం మురళి, వీర లంకపల్లి గ్రామ అధ్యక్షుడు మామిడిపల్లి నాగేశ్వరరావు, గోకవరం మండల జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలు 15 రోజులకు చేరుకున్నాయి. దీక్షకు మద్దతుగా పాల్గొన్న మాజీ శాసనమండలి ఉపాధ్యక్షులు రెడ్డి సుబ్రమణ్యం చంద్రబాబు అక్రమ అరెస్ట్ తీవ్రంగా ఖండిస్తూ చేయని తప్పుకు గత 19 రోజులుగా చంద్రబాబు నాయుడు అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేసి జైల్లో పెట్టడాన్ని ఖండించారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలని ఈ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలంటూ టిడిపి నేతలు గాడిదకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, నడింపల్లి సుబ్బరాజు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, అర్థాని శ్రీనివాస్, దొమ్మేటి రమణ కుమార్, ఉదయ్, కురసాల శివ బాబు, సత్తి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండే క్షణాల్లో ప్రాణాలు పోయాయి

- పిడుగుపాటు సంఘటనలో ప్రత్యక్ష సాక్షి విశాలాంధ్రకు చెప్పిన వివరాలు

విశాలాంధ్ర - లింగపాలెం : రెండే క్షణాల్లో ఊహించని విధంగా ఇద్దరిని మృత్యువు కబళించిందని మృత్యుబారిన పడిన వారి కంటే మూడడుగులు ముందు ఉండటంతో మృత్యు బారి నుండి బయటపడ్డానని పాచ్వానగరంలో పిడుగుపాటు సంఘటనను ప్రత్యక్షంగా చూసిన సొంగా జోత్న్స వివరించింది. పిడుగుపాటుకు సంబంధించిన వివరాలను విశాలాంధ్ర సేకరించింది. ఈసంఘటనలో ప్రాణాపాయం నుంచి బయటపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జోత్న్స ఆవేదనతో వివరాలు తెలిపింది. పత్తి చేలో పనిచేస్తుండగా భారీ వర్షం పడింది. వర్షానికి తడిసిపోతుండటంతో దగ్గరలో ఉన్న టేకు చెట్టు కిందకు వచ్చా. ఈలోపు ఉరుములు, మెరుపులు భయంకరంగా వస్తుండటంతో చెట్టు కింద ఉన్న వాళ్ళం ముందుకు అడుగులు వేశాం. తాను మూడు అడుగులు ముందున్నాను. ఈలోగా పిడుగుపడింది. ఈ అదురుకు 20 అడుగుల దూరంలో పొలంలో పడ్డాను. నేను పడిన కొద్దిక్షణాల్లో దేవమాత వచ్చి నాపైన పడింది. పడగానే పక్కనే ఉన్న బురద నీటిని తాగేసి అక్కడే ప్రాణాలు వదిలింది. మరోవైపు మనీషా(చిన్నారి) పడింది. ఆమె అక్కడే జీవచ్ఛవం అయ్యింది. చనిపోయిన ఇద్దరు చెప్పులు వేసుకోలేదు. నా కాళ్ళకు చెప్పులు ఉన్నాయి. వీరికంటే కొద్దిగా ముందు ఉన్నాను. అదే నా ప్రాణాలు కాపాడింది. ముగ్గురం కలిసి పనికి వచ్చాం. నా సహచరులు ఇద్దరు ఈ ప్రమాదంలో మృతి చెందటం తట్టుకోలేకపోతున్నానని తెలిపింది.

కొనసాగుతున్న టీడీపీ నిరసనలు

విశాలాంధ్ర - జగ్గంపేట : టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుపై నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేటలో నిరసనలు కొనసాగుతున్నాయి. జగ్గంపేట క్లస్టర్ ఇంచార్జ్ జీను మణిబాబు ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు 15వ రోజు కొనసాగాయి. జగ్గంపేట, కాట్రావులపల్లి, సీతానగరం గ్రామాల టీడీపీ నేతలు దీక్షల్లో పాల్గొన్నారు. వీరికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ నల్ల కండువాలు వేసి దీక్షల్లో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఎటువంటి ఆధారాలు లేకుండా తప్పుడు కేసులు బనాయించారన్నారు.

ఐ పోలవరంలో అట్టహాసంగా 'వరల్డ్ టూరిజం డే'

విశాలాంధ్ర - ఐ పోలవరం : ప్రపంచ టూరిజం డేను పురస్కరించుకుని డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో కార్యక్రమం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, ఐ పోలవరం నందు ఘనంగా బుధవారం అట్టహాసంగా జరిగాయి. టూరిజాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఐ పోలవరం జడ్పీటిసి సభ్యులు ముదునూరు సతీష్ రాజు, ఎంపీపీమోర్త రాణి, మీరేం జ్యోతిలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం రీజినల్ డైరెక్టర్ ఒంటెద్దు స్వామి నాయుడు, జిల్లా టూరిజం ఆఫీసర్ వి వెంకటాచలం, రాజమండ్రి ఆధ్వర్యంలో యువ టూరిజం క్లబ్ కార్యక్రమాలు కోనసీమ జిల్లాలోని జిల్లా స్థాయికి ఎంపికైన 14 పాఠశాలల విద్యార్థులకు టూరిజం పై అవగాహన కల్పించేలా డ్రాయింగ్, వకృత్వం మరియు రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు, మరియు ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం లోస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ రేవు సోరెడ్డి, పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వీధి సురేష్ బాబు, స్టాఫ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, సైన్స్ టీచర్ ఎమ్ శాంతకుమార్, సోషల్ టీచర్ గోలకోటి రాంబాబు, క్రాఫ్ట్ టీచర్ వసంత లక్ష్మి, ఏపీ టూరిజం ఆఫీస్ సిబ్బంది ఉదయ్ కుమార్, త్రివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.